15న ఆలయ భూముల వేలం

తాండూరురూరల్, ఏప్రిల్ 12: తాండూరు మండల పరిధిలోని చంద్రవంచ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ భూములను ఈనెల 15న వేలం వేయనున్నట్లు దేవాదాయశాఖ అధికారులు పేర్కొన్నారు. ఆలయ పరిధిలోని 32ఎకరాల భూమికి సోమవారం వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ ప్రజలు వేలంలో పాల్గొనాలని సూచించారు.

ప్రజా ఆశీర్వాద సభకు

సర్వం సిద్ధం

- చేవెళ్లలో నేడు బీఆర్ఎస్ బహిరంగ సభ.. ఏర్పాట్లు పూర్తి
- ఇక్కడి నుంచే లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్న కేసీఆర్
- రెండు లక్షల జనం తరలింపే లక్ష్యం
- ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

ఫరా కళాశాల మైదానంలో ఏర్పాట్లు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిఅర్బన్/చేవెళ్ల, ఏప్రిల్ 12) : లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ రెడీ అయింది. అన్ని స్థానాల్లో ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన గులాబీ బాస్ కేసీఆర్ లోకసభ ఎన్నికల శంఖారావాన్ని చేవెళ్లలో పూరించనున్నారు. పార్లమెంట్‌ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో కారుస్పీడు పెరుతోంది. ఇప్పటికే తెలంగాణభవన్‌లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలతో కేటీఆర్ సమావేశమై లోక్‌సభ ఎన్నికలపై చర్చించారు. శనివారం చేవెళ్లలోని ఫరా కళాశాల మైదానంలో నిర్వహించే బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు గులాబీ అధినేత కేసీఆర్ హాజరు కానున్నారు. సాయంత్రం 4.30 గంటలకు జరగనున్న బహిరంగసభలో కేసీఆర్ ప్రసంగించనున్నారు. చేవెళ్లతో పాటు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, భువనగిరి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాలతో రంగారెడ్డిజిల్లాకు అనుబంధం ఉండటంతో చేవెళ్ల వేదికగా ప్రతిపక్ష పార్టీల పాలన తీరును ఎండగట్టేలా కేసీఆర్ ప్రసంగం సాగనున్నట్లు సమాచారం. ఇప్పటికే రెండుసార్లు చేవెళ్ల ఎంపీ సీటును కైవసం చేసుకున్న బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టి గులాబీ జెండా ఎగురవేసి ప్రతిపక్షాలకు దీటైన సమాధానం చెప్పాలని అడుగులు వేస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు నిర్వహిస్తున్న తొలిసభకు రెండు లక్షల మంది జనాలను తరలించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేద్దాం : ఎమ్మెల్యే సబితారెడ్డి

బీఆర్ఎస్ ప్రజాఆశీర్వాద సభను బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు చేవెళ్లలోని ఫరా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో జరగనున్న బహిరంగసభ ఏర్పాట్లను ఎమ్మెల్యే కాలె యాదయ్య, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌లతో కలిసి సబితారెడ్డి పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చేవెళ్లలో జరగనున్న బీఆర్ఎస్ బహిరంగ సభకు లోక్‌సభ పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కేసీఆర్ పదేళ్ల పాలన, కాంగ్రెస్ పార్టీ మూడు నెలల పాలన బేరీజు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చేవెళ్ల లోక్‌సభ ఎంపీ అభ్యర్థిగా బీసీ నేత, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే యాదయ్య, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌లు మాట్లాడారు. బీసీలంతా ఐక్యంగా ఉంటూ.. బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, రాష్ట్రనాయకులు కార్తీక్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, మండల అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు అనంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.యాదగిరి, గిరిధర్‌రెడ్డి, వెంకటేశ్, తోట చంద్రశేఖర్, నరేందర్‌గౌడ్, నర్సింహులు, వెంకటేశ్, మహేందర్, మాజీ సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి సబితారెడ్డి

రాత్రికి రాత్రే బస్‌షెల్టర్ మాయం!

- ప్రయాణికుల ఆందోళన..తిరిగి ఏర్పాటు చేయాలని డిమాండ్

కీసర రూరల్, ఏప్రిల్ 12 : ప్రయాణికుల సౌకర్యార్థం నాగారం మున్సిపాలిటీ ఎస్వీనగర్‌లో ఏర్పాటు చేసిన షెల్టర్ రాత్రికి రాత్రే మాయమైంది. బస్‌షెల్టర్ వెనకాల ఉన్న స్థలయజమాని ఈ మధ్యనే భారీ నిర్మాణం చేపట్టాడు. నిర్మాణానికి బస్‌షెల్టర్ అడ్డుగా ఉండడంతో ఎలాంటి అనుమతులు లేకుండా, మున్సిపల్ అధికారులకు సమాచారం లేకుండా రాత్రికి రాత్రే తొలగించారు. ఎండలు మండుతుండడంతో ప్రయాణికులకు నిలువనీడ లేకుండా పోయింది. దీంతో ప్రయాణికులు ఎండలోనే బస్సుల కోసం వేచి చూస్తున్నారు. దశాబ్దాలుగా ఉన్న బస్‌షెల్టర్‌ను స్వలాభం కోసం తొలగించటమేంటని స్థానికులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగంగా బస్‌షెల్టర్ పక్కనే రూ.6లక్షల మున్సిపల్ నిధులతో బయో టాయ్‌లెట్స్‌ను ఏర్పాటు చేశారు. అది కూడా గుట్టుచప్పుడు కాకుండా మాయం చేసినా ఆశ్చర్యపోనవసరం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే బస్‌షెల్టర్‌ను తిరిగి ఏర్పాటు చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా దీనిపై మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్‌ను వివరణ కోరగా బస్‌షెల్టర్‌ను తొలగించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ అధికారులకు సమాచారం లేకుండా, అనుమతి లేకుండా బస్‌షెల్టర్‌ను తొలగించటం నేరమన్నారు.



ఎస్వీనగర్‌లో బస్‌షెల్టర్



బస్‌షెల్టర్ తొలగించిన తర్వాత



వైభవంగా వేంకటేశ్వరుడికి చక్రస్నానం

కొడంగల్, ఏప్రిల్ 12: పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి చక్రస్నానాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని వరహాస్వామి మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనే, సుగంధ ద్రవ్యాలతో పురోహితులు అభిషేకం నిర్వహించారు. అనంతరం పుష్కరిణిలో స్వామివారికి చక్రస్నానం చేయించారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పురోహితులు, భక్తులు పాల్గొన్నారు.



త్వరలో స్థానిక సమరం!

లోక్‌సభ తరువాత ఎన్నికలు

లోక్‌సభ ఎన్నికలు ముగియగానే స్థానిక సమరం ప్రారంభం కాబోతోంది. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మే 13న లోక్‌సభ ఎన్నికలు జరగనుండగా, జూన్ 4వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పూర్తయిన తరువాత పురపాలక సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. అయితే లోక్‌సభ ఎన్నికల్లో ఎవరు ఎక్కువ కష్టపడి పని చేస్తారో.. వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు అవకాశం కల్పిస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేయడంతో అశావహులు దూసుకుపోతున్నారు.

- జులైలోగా పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పూర్తిచేసే దిశగా కసరత్తు?
- లోక్‌సభ ఎన్నికల్లో పనితీరు ఆధారంగానే స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు నాయకులకు అవకాశం

వికారాబాద్/మేడ్చల్, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ఫిబ్రవరి 2వ తేదీతో ముగియగా, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీకాలం జూలై మొదటివారంలో ముగియనుంది. మునిసిపల్ పాలకవర్గాల పదవీకాలం 2025, జనవరి 26వ తేదీతో ముగియనుండగా, పీఏసీఎస్ పాలకవర్గాల పదవీకాలం అదే ఏడాది ఫిబ్రవరి నెలతో ముగియనుంది. గ్రామ పంచాయతీల పదవీ కాలం ముగియడంతో ప్రస్తుతం గ్రామాల్లో పాలకవర్గాల స్థానంలో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీల ఎన్నికలు వాయిదా వేశారు. జూలై మొదటివారంలో జిల్లా, మండల పరిషత్తుల్లో కొత్త పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తికాగానే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచనప్రాయంగా నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఆ తరువాత మునిసిపల్, పీఏసీఎస్ ఎన్నికలపై దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే రాష్ట్ర ఎన్నికల సంఘం అందుకు తగిన ఏర్పాట్లపై దృష్టి సారించనుంది. వచ్చే ఫిబ్రవరి నాటికి రాష్ట్రంలో అన్ని ఎన్నికలు పూర్తి చేసి, అభివృద్ధిపై దృష్టి సారించాలని భావిస్తోంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలో 18 మండల పరిషత్‌లు ఉండగా కొత్తగా చౌడాపూర్, దుద్యాల రెవెన్యూ మండలాలు ఏర్పడ్డాయి. ఈ రెండింటిలో మండల ప్రాదేశిక నియోజకవర్గ(ఎంపీటీసీ) స్థానాలను గుర్తించాల్సి ఉంటుంది. 566 గ్రామ పంచాయతీలు, 20 మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి, గ్రామీణ ఓటర్ల జాబితా రూపొందించి రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేసి ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది.

రంగారెడ్డి జిల్లాలో 27మండలాలు, 558 గ్రామపంచాయతీలున్నాయి. 2019లో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలను నిర్వహించారు. మొత్తం 505పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. 53 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మొదటివిడతలో మొత్తం 179 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా 159 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. 20 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. రెండో విడతలో 181 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా 160 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. 21పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అలాగే మూడో విడతలో 198 పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా 186 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. 12 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. రంగారెడ్డి జిల్లాలో 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు ఉన్నాయి. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 100 వార్డులు ఉండగా మున్సిపాలిటీల పరిధిలో 251 వార్డులు ఉన్నాయి. 2019లో రంగారెడ్డి జడ్పీని మూడుగా విభజించారు. వికారాబాద్, మేడ్చల్ జిల్లా ప్రజాపరిషత్‌లను వేరు చేశారు. తర్వాత రంగారెడ్డి జిల్లాలో 21 మండల పరిషత్‌లు, 257 ఎంపీటీసీ స్థానాలు ఏర్పాటు చేశారు.



పనితీరు ఆధారంగానే అవకాశం

కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో కనీసం 14 స్థానాల్లో విజయకేతనం ఎగురవేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎవరు ఎక్కువ కష్టపడి పనిచేస్తారో.. వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు అవకాశం కల్పిస్తామంటూ రేవంత్‌రెడ్డి స్పష్టం చేసిన విషయం తెలిసిందే. స్థానిక సంస్థల్లో పోటీ చేయాలని ఆశిస్తున్న నాయకులు, కార్యకర్తలు లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ శ్రేణులకు ఆయన సూచించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే, ఈ ఎన్నికల్లో చూపే పనితీరు ఆధారంగానే ఇందిరమ్మ కమిటీల్లోనూ సభ్యులుగా అవకాశం కల్పించనున్నట్లు ప్రకటించిన విషయం విదితమే. బూత్‌లవారీగా సాధించిన మెజార్టీని పరిశీలించి నాయకుల పనితీరును అంచనా వేయనున్నారు.

జనవరి, ఫిబ్రవరి నెలల్లో మునిసిపల్, పీఏసీఎస్ ఎన్నికలు?

మునిసిపల్, పీఏసీఎస్ ఎన్నికలు వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో జరిగే అవకాశం ఉంది. మునిసిపల్ పాలకవర్గాల పదవీకాలం వచ్చే ఏడాది జనవరి 26వ తేదీతో ముగియనుంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పదవీకాలం అదే ఏడాది ఫిబ్రవరి నెలలో ముగుస్తుంది. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పూర్తిచేసుకుని, వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరిలోగా మునిసిపల్, పీఏసీఎస్ ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉందని చెబుతున్నారు.

పుంజుకున్న కాంగ్రెస్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 61 గ్రామపంచాయతీలు, ఐదు మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఇప్పటి వరకూ అధిక సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీకి చెందినవారే ఉన్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికల అనంతరం పలువురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లాలో కేవలం ఒక సర్పంచ్, ఒక జడ్పీటీసీ స్థానానికే పరిమితమైన కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక పుంజుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావాహులు పార్టీలో చేరుతున్నారు.



ఇంటింటికీ

ఇంకుడు గుంత!



- మున్సిపాలిటీల్లో సర్వేకు ప్రణాళిక
- అందుబాటులోకి ప్రత్యేక యాప్
- 300 అడుగుల ఇంటి నిర్మాణానికి తప్పనిసరి
- కొత్త నిర్మాణాలకు ఇంకుడు గుంతతో లింకు

తాండూరు, ఏప్రిల్ 12: ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత (రెయిన్ వాటర్ హార్వేస్టింగ్ స్ట్రక్చర్) ను తప్పని సరిగా నిర్మించాల్సిందేనని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 300 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగి ఉన్న నిర్మాణాల్లో ఇంకుడుగుంతను ఏర్పాటు చేయాలని లేకపోతే నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కమిషనర్లను ఆదేశించారు. ఈ మేరకు మున్సిపాలిటీలలో రెయిన్ వాటర్ హార్వేస్టింగ్ స్ట్రక్చర్‌కు సంబంధించి టౌన్‌ప్లానింగ్ , రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఇందుకు సంబంధించి యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. భూగర్భ జలాల అవశ్యకతను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో నీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తుగా ఈసర్వేను చేపట్టి ఆర్‌డబ్ల్యూహెచ్‌ఎస్‌లను నిర్మించాలని నిర్ణయించింది. వికారాబాద్ జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలున్నాయి. సర్వే అనంతరం నిర్మాణాలు చేపట్టే ప్రతీ ఇంటికి కచ్చితంగా ఇంకుడు గుంత నిర్మించాలన్న నిబంధనను అమలు చేయాలని నిర్ణయించారు. ఈనెలాఖరు నాటికి సర్వేను పూర్తి చేయాలని అధికారులు సూచించారు. గతంలో నిర్మించిన పాత ఇళ్లకు కూడా ఇంకుడుగుంత నిర్మించేందుకు చర్యలు తీసుకోనున్నారు. జీవో ఎంఎస్-49ని కచ్చితంగా అమలు చేయాలని కమిషనర్లను ఆదేశించారు. చిన్న నిర్మాణాలకూ నీటి రీసైక్లింగ్ ప్లాంట్ల అవశ్యకతను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

మున్సిపాలిటీ	ఇండ్ల సంఖ్య	వార్డులు	సర్వే బృందాలు
వికారాబాద్	14,539	34	34
తాండూరు	13,740	36	01
కొడంగల్	4,076	12	12
పరిగి	5,055	15	15

స్థలాల గుర్తింపునకు కమిటీ

ఆర్‌డబ్ల్యూహెచ్‌ఎస్ నిర్మాణాలకు సంబంధించి స్థలాలను గుర్తించడానికి కమిటీని నియమించాలని నిర్ణయించారు. ఇందులో మున్సిపల్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్ , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, శానిటేషన్ సిబ్బందిని నియమించాలి. ఈకమిటీ ఇప్పటికే ఉన్న ఇంకుడు గుంతలు సంఖ్య, ఇంకా నిర్మించాల్సిన ఇంకుడు గుంతల లెక్కలను తేల్చాలి. ఇందుకు సంబంధించి సర్వేను కూడా వార్డుల వారీగా నిర్వహించనున్నారు.

రూ. లక్షా 20వేలు సీజ్

- ఎన్నికల నేపథ్యంలో ముమ్మర తనిఖీలు

పరిగి/తాండూరు/కులకచర్ల ఏప్రిల్ 12: తాండూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం ఉదయం వాహనాలు తనిఖీలు నిర్వహించారు. సాయిపూర్ గ్రామానికి చెందిన అంబర్‌పేట్ పవన్‌కుమార్ రూ.లక్షా 20వేల నగదును తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. సీజ్ చేసిన నగదును వికారాబాద్ కలెక్టరేట్‌లోని ట్రెజరర్‌కు పంపినట్లు తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు పరిగి ఎస్ఐ సంతోష్ తెలిపారు. శుక్రవారం పరిగి చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్ పాటించాలని చెప్పారు. నగదు, ఆభరణాలు తీసుకెళ్లేటప్పుడు ఆధారాలు ఉండాలని సూచించారు. కోడ్ ఉల్లంఘించిన ఎంతటివారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాకుండా కులకచర్ల-పరిగి మార్గంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల్లో మద్యం తరలించినా, రూ.50వేలకు మించి నగదు పట్టుబడితే సీజ్ చేయనున్నట్లు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు



పరిగిలో వాహనాల తనిఖీ

అమ్మ ఆదర్శ కమిటీలతో సమస్యలు తీరేనా?

మర్పల్లి, ఏప్రిల్ 12: ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసింది. మహిళా సంఘాల అధ్యక్షురాలు చైర్మన్‌గా, పాఠశాల ప్రధానోపాధ్యాయులను కన్వీనర్‌లుగా నియమించి ప్రత్యేక నిధులను కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. అందులో భాగంగా మర్పల్లి మండలంలోని 50 ప్రాథమిక పాఠశాలలతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా గుర్తించారు. ఇదివరకే ఆయా గ్రామాల్లో మహిళా సంఘాల అధ్యక్షురాలిని చైర్మన్‌గా నియమించి పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో అధికారులు సమావేశం నిర్వహించారు. మండలంలోని 50 పాఠశాలలకు రూ.లక్ష నుంచి రూ.3 లక్షలు నిధులు కేటాయించి రూ.కోటీ 58లక్షలు ప్రభుత్వం నుంచి మంజూరు కోసం నివేదికలు పంపించారు. ఇదిలా ఉండగా గతంలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలలకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోయినా ఆయా గ్రామాల్లో పాఠశాలల ఎస్‌ఎంసీ చైర్మన్లు, కాంట్రాక్టర్లు పనులు చేయించినా అప్పటి వరకు పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కాలేదని ఓవైపు ఆందోళన వ్యక్తం చేస్తుండగా మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని కమిటీ సభ్యులు చెబుతున్నారు.



మర్పల్లి ప్రాథమిక పాఠశాల

ప్రయాణికులకు బస్‌షెల్టర్ ఏదీ?



బషీరాబాద్ రైల్వేస్టేషన్ కూడలిలో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

బషీరాబాద్, ఏప్రిల్ 12: మండల కేంద్రంలో బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడికి వచ్చే ప్రయాణికులు ప్రతీరోజు రైల్వేస్టేషన్ కూడలిలోని చింతచెట్టు కింద లేదా హోటళ్ల ఎదుట నిలబడాల్సివస్తోంది. 22ఏళ్ల కిందట స్థానిక గ్రామ పంచాయతీ పక్కన బస్టాండ్ నిర్మించినప్పటికీ బస్సులు ఇక్కడికి వచ్చే వీలు లేకపోవడంతో వృథాగా మారింది. దీంతో వివిధ ప్రాంతాలకు ప్రయాణించే వారు నిలువ నీడలేక ప్రధానదారి పక్కనే నిలబడి ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్టీసీ బస్సులోంచి ప్రయాణికులను రోడ్డుపై దింపి, ఎక్కించుకోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పైగా బస్సులను నడిరోడ్డుపైనే నిలపాల్సి రావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రతీ మంగళవారం సంత రోజు ఇక్కడి ప్రాంతంలో వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితిలో ట్రాఫిక్ జామ్ కావడం షరామామూలేనని ప్రయాణికులు వాపోతున్నారు. బస్‌షెల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు పలువురు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ మోత్యానాయక్

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 12: రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వ మద్దతు ధర కేంద్రాలను వినియోగించుకోవాలని డీసీఎంఎస్ ప్రతినిధి వెంకటేశం కోరారు. మండలంలోని బాపల్లితండాలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. 17శాతం తేమతో నాణ్యతమైన ధాన్యాన్ని తీసుకొస్తే మద్దతు ధర అందిస్తామని తెలిపారు. నిర్దేశిత నిబంధనల మేరకు కేంద్రంలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోత్యానాయక్, సంతోష్, రాంనాయక్, మోహన్‌నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వడ్లనందు

బీఆర్ఎస్ మునిగిపోయిన నౌక

వికారాబాద్, ఏప్రిల్ 12: చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరినట్లు బీఆర్ఎస్ పార్టీలో ముందు నుంచి కష్టపడిన వారికి కాకుండా కొత్త వారికి అవకాశాలు ఇచ్చారని బీజేపీ నాయకుడు వడ్లనందు ఆరోపించారు. ఆయన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంతకు ముందు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ సమక్షంలో బీఆర్ఎస్ వీడి బీజేపీ పార్టీలో ఆయన అనుచరులతో కలిసి చేరారు. తాను బీఆర్ఎస్‌లో రెండుదఫాలుగా ఎమ్మెల్యే టిక్కెట్ అడిగినా పట్టించుకోలేదన్నారు. 18 సంవత్సరాలుగా ఒకే పార్టీలో ఉండి పని చేశానన్నారు. దశాబ్దం ఉద్యమంలో పాల్గొన్నానని తెలిపారు. కొండాపూర్ కలాన్ గ్రామాన్ని దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడంలో ముందున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌పై వ్యతిరేకత ఉన్నా బీఆర్ఎస్ అధిష్టానం పట్టించుకోలేదన్నారు. ఆ పార్టీ ఎవరికీ నామినేటెడ్ పదవులు ఇవ్వలేదని దుయ్యబట్టారు. రంజిత్‌రెడ్డి వరంగల్ నుంచి ఇక్కడికి వచ్చి రూ.10వేల కోట్లు సంపాదించుకున్నాడని, ఆనంద్ వల్లే బీఆర్ఎస్ పార్టీ నాశనమైందని ఆరోపించారు. ఎంపీగా విశ్వేశ్వర్‌రెడ్డి గెలిస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఎన్నికల సమయంలో ఎంపీ రంజిత్‌రెడ్డి దాణా కుంభకోణం చేశారని ఆరోపించారని, ఇప్పుడు ఎలా కలిసి పనిచేస్తారని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీకి 400 సీట్లు వస్తాయని, చేవెళ్ల స్థానం నుంచి గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, రాజునాయక్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వడ్లనందు అనుచరులు ఉన్నారు.

మోదీని మరోసారి ప్రధాని చేసేందుకు సిద్ధం

తాండూరు, ఏప్రిల్ 12: మోదీని మరోసారి ప్రధాని చేసేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి కొండా సంగీతరెడ్డి అన్నారు. ఎన్నికల్లో తన భర్తను గెలిపించాలని కోరుతూ తాండూరు నియోజకవర్గంలో ఆమె శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన వ్యక్తి మోదీ మాత్రమేనని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గాన్ని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని తెలిపారు. గొప్ప సహజవనరులున్న వికారాబాద్‌లో ఆయన ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తారని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అంతకుముందు తాండూరు చేరుకున్న కొండా సంగీతరెడ్డి స్థానికంగా ఉన్న వైద్యులతో హోటల్ హిమాలయాలో సమావేశమయ్యారు. అనంతరం స్థానిక విఘ్నేశ్వరుడి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. కొండా సంగీతరెడ్డి వెంట తాండూరు బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.



విశ్వేశ్వర్‌రెడ్డిపై పూలు చల్లి ఆశీర్వదిస్తున్న బురుజుగడ్డ తండా మహిళలు



తాండూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతరెడ్డి

ముచ్చటగా మూడోసారి బీజేపీదే విజయం

యాలాల: కేంద్రంలో ముచ్చటగా మూడోసారి బీజేపీ విజయం ఖాయమని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి కొండా సంగీతరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆమె బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సంగీతరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడ చూసినా బీజేపీ పవనాలు వీస్తున్నాయన్నారు. చేవెళ్ల ఎంపీ నియోజకర్గం నుంచి బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైనికులుగా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి కృష్ణ మృతురాజ్, అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, దేవనూర్ మాజీ సర్పంచ్ శివకుమార్, నాయకులు రమేష్, నరేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నడిపే సత్తా మోదీకే ఉంది

మహేశ్వరం, ఏప్రిల్ 12 : పాలనా పరంగా ఎన్ని కష్టాలు వచ్చినా వాటిని అధిగమించి, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా ప్రధాని నరేంద్రమోదీకే ఉందని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆయన చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్ర శుక్రవారం సాయంత్ర మహేశ్వరం మండలానికి చేరుకుంది. మండలంలోని నాగారం, డబిల్‌గూడ, మన్‌సాన్‌పల్లి, పెండ్యాల, కోళ్లపడకల్, దుబ్బచర్ల, పోరండ్ల గ్రామాల్లో పర్యటించిన కొండా ప్రజలను నేరుగా కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ఇస్తున్న, ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మడం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడ్డ నాలుగు నెలలకే ప్రజాదరణ కోల్పోయిందని చెప్పారు. మరోసారి మోదీ ప్రధాని కావడం కాయమన్నారు. చేవెళ్లలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని జోస్యం చెప్పారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి తప్ప మరోటి కనిపించడంలేదని ప్రజలకు చెప్పారు. దేశం కోసం ధర్మం కోసం నిజాయితీగా పని చేసేది నరేంద్ర మోదీ మాత్రతేనని అన్నారు. మే 13న జరగబోయే ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటు వేసి బీజేపీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, మహేశ్వరం ఇన్‌చార్జీ అందెల శ్రీరాములుయాదవ్, నాయకులు పాపయ్యగౌడ్, మిద్దె సుదర్శన్‌యాదవ్, కె. జంగయ్యయాదవ్, కుండె వెంకటేష్, టి. యాదీష్, బీజేపీ మండలాధ్యక్షుడు మాధవాచారి, పి. సుదర్శన్‌యాదవ్, యాదయ్య, ముత్యం, శ్రీశైలం, వివిధ గ్రామాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్రం నిధులిచ్చినా చేసిందేమీ లేదు

శంషాబాద్‌రూరల్, ఏప్రిల్ 12 : తెలంగాణ రాష్ట్ర ప్రగతి కోసం ప్రధాని నరేంద్ర మోదీ భారీగా నిధులు ఇచ్చారని, వాటిని ఇతర శాఖలకు మళ్లించిన మాజీ సీఎం కేసీఆర్ చేసిందేమీ లేదని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శంషాబాద్ మండలంలోని బురుజుగడ్డతండా, చిన్నగోల్కొండ, శంకరాపూర్, కొత్తగూడ, పెద్దగోల్కొండ, ముచ్చింతల, హమీదుల్లానగర్, బహదూర్‌గూడ, షాపూర్‌తండా, సంఘీగూడ, మదనపల్లి గ్రామాల్లో జరిగిన ప్రజా ఆశీర్వాదసభల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ మరోమారు మోదీని ప్రధానిని చేయాలన్నారు. మోదీ చేస్తున్న కృషిని విదేశాల నాయకులు ప్రశంసిస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో వైకుంఠ ధామాలు, రైతువేదికలు, రోడ్లకు కేటాయించిన నిధులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చినవేనని తెలిపారు. లిక్కర్ దందా, ఫోన్ ట్యాపింగ్‌తో వేగలేక బీఆర్ఎస్ నాయకులు సతమతమవుతున్నారని అన్నారు. బీజేపీ నాయకులు తోకల శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, మాజీ సర్పంచ్ సుజాత, కందశ్రీను, ప్రశాంత్, లక్ష్మయ్య, గండురాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్‌పై పిటిషన్‌లో భూమి హక్కుపై చర్చ ఎందుకు?

- ఇలాంటి రిట్ ద్వారా టైటిల్‌ను నిర్ధారించలేం
- విద్యుత్ పంపిణీ సంస్థే నిర్ణయం తీసుకోవాలి
- శంకర్‌హిల్స్ లేఅవుట్‌పై హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని దాఖలైన ఒక రిట్ పిటిషన్‌లో భూమి హక్కులు ఎవరికి ఉన్నాయి అనే అంశాన్ని చర్చించడం సమంజసం కాదని హైకోర్టు పేర్కొంది. ఇలాంటి రిట్ పిటిషన్‌ల ద్వారా భూమిపై టైటిల్ హక్కులను నిర్ధారించలేమని డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. అప్పీలుదారు, ప్రతివాది వాదనలు విని సదరు విద్యుత్ కనెక్షన్ దరఖాస్తుపై విద్యుత్ పంపిణీ జనరల్ టర్మ్స్ అండ్ కండిషన్స్‌లోని క్లాజ్ 5 ప్రకారం నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర దక్షిణ మండల విద్యుత్తు పంపిణీ సంస్థకు ఆదేశాలు జారీచేసింది.

రంగారెడ్డి జిల్లా పట్టినాగులపల్లి శంకర్ హిల్స్ లేఅవుట్‌లోని 111, 134, 135 నుంచి 191 వరకు ఉన్న పలు సర్వే నెంబర్‌లలోని భూములపై టైటిల్ వివాదం కొనసాగుతోంది. ఈ భూములను రిజిస్టర్డ్ సేల్‌డీడ్ ద్వారా కొనుగోలు చేశామని జైహింద్ గ్రీన్‌ఫీల్డ్ తదితర సంస్థలు పేర్కొంటుండగా 1983 నుంచి 1986 వరకు తాము ప్లాట్లు కొనుగోలు చేశామని 3,328 మంది ప్లాట్ యజమానులు పేర్కొంటున్నారు. ఈ భూముల యాజమాన్య హక్కులకు సంబంధించిన వివాదాలు వివిధ సివిల్ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో సదరు ప్లాట్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి విద్యుత్ పంపిణీ సంస్థ నిరాకరిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఒక ప్లాట్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేలా ఆదేశించాలని కోరుతూ గోపు నాగమణి అనే మహిళ హైకోర్టును ఆశ్రయించారు. ఇదే పిటిషన్‌లో తమ వాదనలు సైతం వినాలని జైహింద్ గ్రీన్‌ఫీల్డ్ సైతం ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసింది. ఇరువర్గాల వాదనలు విన్న ఏకసభ్య ధర్మాసనం.. 1983లో జరిగిన రిజిస్ట్రేషన్ ద్వారా పిటిషనర్‌కు సదరు ప్లాట్ వారసత్వంగా వచ్చిందని.. ఒక్కసారి కొన్న భూమిని మళ్లీ మళ్లీ రిజిస్ట్రేషన్‌ల ద్వారా ఇతరులు కొనుగోలు చేయలేరని పేర్కొంది. ఇంప్లీడ్ అయిన జైహింద్ గ్రీన్‌ఫీల్డ్‌కు సదరు భూమిపై ఎలాంటి టైటిల్ లేదని తెలిపింది. ప్లాట్ యజమాని అయిన నాగమణికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ పంపిణీ సంస్థను ఆదేశించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ జైహింద్ గ్రీన్‌ఫీల్డ్ సంస్థ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. కేసులు పెండింగ్‌లో ఉన్న దృష్ట్యా భూవివాదానికి సంబంధించిన అంశాల్లోకి వెళ్లకూడదని భావించి సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును కొట్టేసింది. నిబంధనల మేరకు రెండు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని దక్షిణ డిస్కంను ఆదేశించింది.

పెండింగ్‌లో ఉపాధి 'కూలి'

- రెండు నెలలుగా పనులు చేస్తున్న కూలీలు
- కూలి రాకున్నా పట్టించుకోని అధికారులు
- పూట గడవక ఇబ్బందులు పడుతున్న కూలీలు

తాండూరు రూరల్, ఏప్రిల్ 12: రెండునెలలుగా కాయకష్టం చేస్తున్న తమకు కూలి రావడంలేదని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తమను పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా తాండూరు మండలంలోని 33 గ్రామాల్లో 6,842మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి. 11,648మంది కూలీలు ఉన్నారు. ఒక్కో జాబ్ కార్డుకు 100రోజులు పనిదినాలు కల్పించారు. ప్రతీ ఏడాది ఏప్రిల్ నుంచి కూలీలకు కొత్త పనిదినాలు ప్రారంభవుతాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో రెండు నెలల పాటు(ఫిబ్రవరి, మార్చి) దాదాపు 3వేల మంది కూలీలు పనిచేశారు. పనిచేసిన కూలీలకు ఇప్పటివరకు డబ్బులు ఖాతాలో జమకాలేదు. ఈ విషయమై అధికారులకు విన్నవిస్తే సర్దిచెప్పి పంపిస్తున్నారని చెబుతున్నారు.



అంతారంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఉపాధి పనులే జీవనాధారం

గ్రామాల్లో వేసవి మూడునెలలు కూలీలకు ఎలాంటి పనులు ఉండవు. కేవలం ఉపాధి హామీ పథకంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఉపాధి హామీ పనులకు వెళ్లేది ఎక్కువగా పేదకుటుంబాలు మాత్రమే. రెండు నెలలుగా చెరువు పూడికతీత, కాల్వల మరమ్మతు, లెవలింగ్ వంటి పనులు చేస్తున్నారు. రెక్కాడితేగానీ డొక్కాడని స్థితిలో ఉన్న పేద కుటుంబాలకు రెండు నెలలుగా డబ్బులు అందక పూట గడిచేదెలా అని కూలీలు వాపోతున్నారు. ఉదయం రెండు, మూడు గంటలపాటు పనులుచేసి వస్తున్న తమకు ఇప్పటి వరకు డబ్బులు రాలేదని కూలీలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఉన్నతాధికారులకు సమాచారం అందించాం

తాండూరు మండలంలో 3వేల మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారు. వారు చేసిన పనికి తగిన వేతనం కూడా అందజేస్తాం. పనిచేసిన ప్రతి కూలీకి సంబంధించిన మస్టర్లలో హాజరువేసి ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తాం. రెండునెలలుగా ఎవరికీ కూలి ఖాతాల్లో జమకాలేదు. అందరికీ త్వరలో డబ్బులు జమవుతాయి. కూలీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- నరోత్తంరెడ్డి, ఏపీవో, తాండూరు మండలం

'ఉపాధి' సౌకర్యాల బాధ్యత పంచాయతీలదే

- రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ
- బాధ్యతగా పని చేయాలని కార్యదర్శులకు ఆదేశం

తాండూరు, ఏప్రిల్ 12: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశిస్తూ ఉత్తర్వులను జారీచేశారు. ప్రస్తుతం డిమాండ్ ఉన్న కాలం అయినందున పనిప్రదేశంలో కనీస సౌకర్యాలైన మంచి సదుపాయం నీడ, ప్రథమ చికిత్స, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కల్పించడంలో పంచాయతీ కార్యదర్శి బాధ్యత అన్నారు. సంవత్సరం పొడువునా పని కోరుకునే కుటుంబాలకు 100 రోజుల ఉపాధి కల్పించేలా చూడాలని, వ్యవసాయ పనులు లేకుండా ఉండే జనవరి నుంచి జూన్ వరకు డిమాండ్ ఎక్కువ ఉంటుందన్నారు. ఈ కాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ చట్టం అమలు విషయంలో పంచాయతీ కార్యదర్శులు తమ పాత్ర బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం లేదని దమ దృష్టికి వచ్చిందన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన పూర్తిగా పంచాయతీ కార్యదర్శులదేనని సూచించారు. సీజన్ కావడంతో కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతోందని వెల్లడించారు. కాగా, ఉదయం పూటే పనులు చేయాలని అధికారులు ఇప్పటికే ఆదేశించారు. ఉదయం 6 నుంచి 11గంటల వరకే చేపడుతున్నారు. కనీస సౌకర్యాల కల్పనకు సంబంధించిన డబ్బులు ఉపాధిహామీ నుంచి పంచాయతీకి వస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు కూలీలు వడదెబ్బకు గురికాకుండా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాల్సి ఉంటుంది. ఇవి క్షేత్రస్థాయిలో కనిపించడంలేదు. గ్రామపంచాయతీల్లో ప్రస్తుతం సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేకాధికారులను నియమించారు. ప్రత్యేకాధికారులు కనీస వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేని కారణంగా పనులూ సక్రమంగా జరగడంలేదనే విమర్శలు వస్తున్నాయి.

'రైతువేదిక' చుట్టూ చెత్త ఏరివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్, ఏప్రిల్ 12: 'మందుబాబులకు అడ్డాగా రైతు వేదిక భవనం' అంటూ ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి బషీరాబాద్ ఎంపీడీవో రాఘవులు స్పందించారు. గ్రామ కార్యదర్శి రవితో చర్చించి వాస్తవ పరిస్థితిపై ఆరాతీశారు. ఎంపీడీవో ఆదేశాలతో కార్యదర్శి పంచాయతీ సిబ్బందితో రైతువేదిక భవనం, పరిసర ప్రాంతాల్లో మద్యం సీసాలు, చెత్తాచెదారాన్ని దగ్గరుండి శుభ్రం చేయించారు. ఇకపై రైతువేదిక భవనం వద్ద నిఘాపెట్టి ఎవరైనా మద్యం తాగినట్లు గుర్తిస్తే పోలీసు కేసు పెడతామని కార్యదర్శి హెచ్చరించారు.



ఎక్మాయి రైతువేదిక వద్ద పడేసిన మద్యం సీసాలను తీసివేస్తున్న సిబ్బంది

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మె

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 12: మండలంలోని పాటిమీదిపల్లి గ్రామానికి విద్యుత్ సరఫరా చేసే నియంత్రిక ప్రమాదకరంగా మారింది. గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కనే గ్రామ శివారులో దిమ్మెపై విద్యుత్ బుడ్డిలను ఏర్పాటు చేశారు. ఎన్నో సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన దిమ్మె శిథిలావస్థకు చేరింది. దిమ్మె రాళ్ల మధ్య పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలి పోతుందోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కనే విద్యుత్ బుడ్డిలు ఉండటంతో అటుగా పశువులు మేత కోసం వెళ్తుండటంతో పాటు చిన్నారులు రోడ్డుపై వెళ్తుంటారని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ నియంత్రికల దిమ్మె స్థానంలో కొత్తగా నిర్మించాలని కోరారు.





మాట్లాడుతున్న సునీతా మహేందర్‌రెడ్డి

సేవ చేశాననే నిజాయితీగా ఓటు అడుగుతున్నా

మేడ్చల్ టౌన్/కీసర/శామీర్‌పేట్/ఘట్‌కేసర్, ఏప్రిల్ 12: మేడ్చల్ జిల్లాకు సేవ చేశాను కాబట్టే డబ్బు రాజకీయాలకు పోకుండా నిజాయితీగా ఓటు అడుగుతున్నానని కాంగ్రెస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పాటు కీసర, శామీర్‌పేట్, పోచారం మున్సిపాలిటీలోని అన్నోజిగూడలో, శామీర్‌పేట పరిధి తూంకుంటలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశాలు నిర్వహించారు. ఆమె కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మేడ్చల్‌కు రూ.300కోట్లు కేటాయించానని గుర్తుచేశారు. మేడ్చల్ ప్రజలతో ఎలాంటి సంబంధం లేని బీజేపీ అభ్యర్థి నేడు తనకు ఓటు వేయాలని అడగటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలతో మమేకమైన తనను నాన్‌లోకల్ అంటూ ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. కాగా, మేడ్చల్‌లో పట్టణానికి చెందిన కాంగ్రెస్ నేత బూషి మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్ల చేరిక పట్ల పార్టీ సీనియర్లపై మండిపడ్డారు. పదేళ్లుగా ఎవరి వల్ల యాతన అనుభవించామో వారినే పార్టీలో చేర్చుకుని తమ నెత్తిపై కూర్చోపెడతారా? అంటూ నిలదీశారు.

పదేళ్లలో బీజేపీ ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు

పూడూరు, ఏప్రిల్ 12: కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ ఒక్క ఉద్యోగమూ ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని మిర్జాపూర్ గేటు సమీపంలో పార్టీ సీనియర్ నాయకుడు కద్మూరు ఆనందం వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం పూడూరు మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపీ రంజిత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిలు మాట్లాడారు. గ్రామాల్లో నిరుద్యోగం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీతో దేశమంతా భష్టుపట్టిందని విమర్శించారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయాలంటే రంజిత్‌రెడ్డిని చేవెళ్ల నుంచి గెలిపించాలన్నారు. ఎన్నికల తర్వాత ఇందిరమ్మ కమిటీ ఏర్పాటుచేసి కార్యకర్తలకు అన్నివిధాలుగా చేయూతనందిస్తామన్నారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు

పూడూరు మండలం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు పెద్దఉమ్మెంతల్ బీఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ శ్రీధర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు ముక్కంటి, కో-ఆప్షన్ సభ్యులు అయ్యూబ్, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదేవిధంగా కుద్బుల్లాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేందర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పెంటయ్య, శ్రీనివాస్, అజీమ్ పటేల్, షకీల్, వీరేష్, లక్ష్మణ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న శ్రీనివాస్ గుప్తా



చేవెళ్లలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న సీతారెడ్డి

కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి: ఎమ్మెల్యే

బషీరాబాద్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పాత రైసుమిల్లు వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల మండల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకులు పి.శంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఖాలేద్, మాజీ ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, తాజామాజీ సర్పంచులు ఎం.నర్సిరెడ్డి, సత్యమ్మ, గాయత్రి, మాజీ సర్పంచ్ జైపాల్ రెడ్డి, పి.వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు బంటురాజు, బోయిని వెంకటయ్యలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన 200మంది నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు సత్యనారాయణరెడ్డి, జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, అజయ్‌ప్రసాద్, జి.మాధవరెడ్డి, ఎస్.వెంకటేష్, ఎం.రోహిత్, కలాల్ నర్సింహులుగౌడ్, లక్ష్మణ్‌రావు, నాయకులు రామునాయక్, శంకరప్ప, వడ్డే ఉల్లప్ప, రిటైర్డ్ టీచర్ నర్సిరెడ్డి పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

చేవెళ్ల, ఏప్రిల్ 12: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి ఎంపీ రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని టీటీడీ బోర్డు సభ్యురాలు, చేవెళ్ల ఎంపీ. రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి ఓటర్లను కోరారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో కాంగ్రెస్ నేతలతో కలిసి ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంజిత్‌రెడ్డిని ప్రజలు ఆదరించి చేవెళ్ల ఎంపీగా మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కరం కోసం ఆయన కృషి చేస్తారని చెప్పారు. ప్రజలు నిండు మనస్సుతో రంజిత్‌రెడ్డిని ఆశీర్వాదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారు శైలజా, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు దేవర సమతారెడ్డి, ప్రధాన కార్యదర్శి గోనే సరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల : శంకర్‌పల్లి మండల పరిధిలోని ప్రొద్దటూర్ గ్రామంలో శుక్రవారం బీరప్ప విగ్రహం, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన, కార్యక్రమం కనుల పండువగా జరిగింది. మహిళలు భారీగా బీరప్ప స్వామికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో గ్రామం మరుమోగింది. వేడుకల్లో చేవెళ్ల ఎంపీ. రంజిత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, టీపీసీసీ కార్యదర్శి ఉదయ్‌మోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఏనుగు నరసింహరెడ్డి, ఎంపీటీసీ ప్రవళిక, మాజీ ఉపసర్పంచ్ మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కన్వీనర్ శ్రీనాథ్‌గౌడ్, మోకిల గ్రామ అధ్యక్షుడు సత్యం, మాజీ ఎంపీపీ. బీర్ల నర్సింలు, నాయకులు వెంకట్‌రెడ్డి, బయన్న, గ్రామస్థులు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల జడ్పీటీసీ దంపతులు

చేవెళ్ల : చేవెళ్ల జడ్పీటీసీ మర్పల్లి మాలతి,కృష్ణారెడ్డి దంపతులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని చేవెళ్ల ఎంపీ. రంజిత్‌రెడ్డి నివాసంలో జడ్పీటీసీ, పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంపీ. రంజిత్‌రెడ్డి వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన బీంభరత్, చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

అసెంబ్లీ స్పీకర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కాంగ్రెస్ పార్టీ నాయకులు

కులకచర్ల, ఏప్రిల్ 12: తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కులకచర్ల మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సొసైటీ చైర్మన్ మొగులయ్య, పరిగి బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్‌కుమార్, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు రవీందర్‌నాయక్ తదితరులు కలిశారు. ఈనెల 28న మండలంలోని పుట్టపహాడ్ గ్రామంలో జరిగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు రావాలని వారు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు లాలు, రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



ముజాహిద్‌పూర్‌లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కులకచర్ల, ఏప్రిల్ 12: ముజాహిద్‌పూర్ గ్రామంలో శుక్రవారం హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవతో కులకచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర మండల ప్రజాపరిషత్ నిధులు మంజూరు చేయగా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. ఎంపీపీ నిధులు రూ.10లక్షలతో ముజాహిద్‌పూర్, లాల్‌సింగ్ తండా, సాల్విడ్ తండా, రాంనగర్, రోకటిగుట్ట తండాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ సత్యహరిశ్చంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు, నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపులకు మరమ్మతులు



కులకచర్లలో చేతి పంపునకు మరమ్మతు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కులకచర్ల, ఏప్రిల్ 12: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పాడైన చేతి పంపులకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తున్నట్లు కులకచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం గ్రామంలో పంచాయతీ సిబ్బంది పాడైన చేతి పంపులకు మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకొచ్చారు. గ్రామపరిధిలో ప్రతీ చేతిపంపుకు మరమ్మతులు చేయించి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రజలకు నీరు అందిస్తామని తెలిపారు. ప్రజలు తాగునీటిని వృథా చేయరాదని సూచించారు.

బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభను జయప్రదం చేయాలి

దోమ, ఏప్రిల్ 12: ఈ నెల 13న చేవెళ్లలో జరిగే బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభను జయప్రదం చేయాలని బొంపల్లి ఎంపీటీసీ రాములు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి మాజీ సీఎం కేసీఆర్, రాష్ట్ర నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. దోమ మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ప్రభావిత వర్గాలే టార్గెట్!

- పార్టీల విధానాలే ప్రచార అస్త్రాలు
- పెద్ద సంఖ్యలో ఓటుబ్యాంకు కలిగిన సామాజిక వర్గాలపై నజర్
- లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు ఎంపీ అభ్యర్థుల విశ్వప్రయత్నం



మేడ్చల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రభావిత వర్గాలే లక్ష్యంగా ప్రచార వ్యూహాలు రూపొందిస్తున్నారు. పెద్దసంఖ్యలో ఓటుబ్యాంకు కలిగిన సామాజిక వర్గాలను తమ వైపు తిప్పుకోవడానికి వ్యూహాలు రచిస్తున్నారు. ఆయా వర్గాలతో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటుచేసి హామీలు ఇస్తూ.. వారిని ప్రసన్నం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. కుల పెద్దలను కలుస్తూ ఎన్నికల్లో ఓట్లు తమ పార్టీకే వేసేలా సహకరించాలని కోరుతున్నారు. ఇందుకు ప్రతిగా.. సదరు సామాజిక వర్గాలకు ఉపయుక్తంగా ఉండే నిర్దిష్టమైన హామీలు ఇస్తున్నారు. ఆ వర్గంలోని వారిని సమన్వయం చేయాల్సిన బాధ్యతను పార్టీలోని అదే సామాజికవర్గ నేతలకు అప్పగిస్తూ కార్యాచరణ రూపొందిస్తున్నారు. కాగా, పార్లమెంటు నియోజకవర్గంలో బీసీకి చెందిన ఓ సామాజికవర్గం ఓటర్లు పెద్దసంఖ్యలో ఉన్నారు. వీరిపై అన్ని పార్టీలు దృష్టి సారించాయి. ఇప్పటికే సమావేశాలు నిర్వహిస్తూ తమవైపునకు తిప్పుకొనే ముమ్మర ప్రయత్నాలు మొదలయ్యాయి.

పార్టీ విధానాలే ప్రచార అస్త్రాలు

బీజేపీ, కాంగ్రెస్‌లతో పాటు బీఆర్ఎస్ నేతలు తమ తమ పార్టీ విధానాలే ప్రధానంగా ప్రచార అస్త్రాలుగా మలుచుకున్నారు. మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ జాతీయస్థాయిలో పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలు నిర్వహిస్తూ.. కాషాయ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. మోదీ హయాంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేస్తున్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి వివిధ వర్గాలను కలవటంతో పాటు నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణులతో సమావేశమవుతున్నారు. యూపీఏ హయాంలో రైతులు, కార్మిక వర్గాల ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయాలతో పాటు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చెబుతున్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పార్టీకి చెందిన ఎమ్మెల్యేలతో కలిసి ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నాయకులతో సమావేశమవుతున్నారు. గడిచిన పదేళ్లలో అన్నివర్గాలను దృష్టిలో పెట్టుకుని అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేసి ఓట్లు పొందాలను నాయకులు, కార్యకర్తలకు సూచిస్తున్నారు. అవకాశం ఇస్తే పార్లమెంటులో ప్రజాగళం వినిపించడంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తానంటూ తన ప్రసంగాల ద్వారా వివరిస్తున్నారు.

ఎండ తీవ్రతతో ప్రచారానికి ఇబ్బంది

ఎండల కారణంగా నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలు రాజకీయ పార్టీల సమావేశాల నిర్వహణపై ప్రభావం చూపుతున్నాయి. పార్టీ శ్రేణులను సమీకరించడం, సమన్వయం చేయటం ఒక ఎత్తయితే వారిని క్షేత్రస్థాయిలో ప్రచారంలో నిమగ్నమయ్యేలా చూడటం కొంత ఇబ్బందిగానే మారింది. ప్రస్తుతానికి ఆయా పార్టీల అభిమానులతో సమావేశాల నిర్వహణ వరకే పరిమితం అవుతున్నారు. వాతావరణం కాస్త అనుకూలంగా మారేనాటికి పార్టీ పెద్ద నాయకులతో ప్రచార కార్యక్రమాలు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల తేదీ వరకు ఎండల ప్రభావం ఉంటుండటంతో సాయంత్రం వేళల్లో ర్యాలీలు, సభలు నిర్వహించే అవకాశం ఉంటుందని పార్టీల నాయకులు చెబుతున్నారు.

ఇంటి వద్దకే సీతారాముల తలంబ్రాలు



శ్రీరామనవమి తలంబ్రాల వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 12: భద్రాచలంలోని సీతారాముల కల్యాణ తలంబ్రాలు ఇంటివద్దనే పొందవచ్చని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆర్టీసీ అధికారులు చేపట్టిన తలంబ్రాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఎమ్మెల్యే తన నివాసంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్టీసీ ద్వారా భద్రాచలం సీతారాములవారి తలంబ్రాలు పొందచ్చన్నారు. అయితే తలంబ్రాలకు సంబంధించి ఆర్టీసీ ఉద్యోగుల దగ్గర ముందే బుక్ చేసుకోవాలని సూచించారు. ఇలా బుక్ చేసుకున్నవారికి ఇంటికే తీసుకొచ్చి అందజేస్తారని తెలిపారు. ఈఅవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తలంబ్రాల ఇన్‌చార్జి విశ్వనాథ్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కె.మొగులయ్య, కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు శేషారెడ్డి, భరత్, రవినాయక్, రామకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



అమ్మవార్లను దర్శించుకున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పూడూరు, ఏప్రిల్ 12: ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ పోచమ్మ ప్రతిష్ఠాపనలో భాగంగా శుక్రవారం ఆలయాన్ని సందర్శించి అమ్మవార్లను ఆయన దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రామస్వామి, వెంకట్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, నవనీత్‌రెడ్డి, శంకరయ్య, విఠలయ్య, నర్సింహులు, గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

బొంరాస్‌పేట్: వరుసగా ఐదు రోజుల పాటు సెలవులు ఉండటంతో దుద్యాల మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ దర్శనం కోసం భక్తులతో కిటకిటలాడింది. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి ఆలయంలో పూజలు చేశారు. బోనాలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయప్రాంగణం సందడిగా మారింది.



పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో భక్తులు

ఆక్రమణకు గురైన నాలా తొలగింపు



జేసీబీ సాయంతో నాలాను తొలగిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు

వికారాబాద్, ఏప్రిల్ 12: నాలా కబ్జా చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని నవాబుపేట మండలంలోని మైతాబ్‌ఖాన్‌గూడ మాజీ సర్పంచ్ అనితా రంగారెడ్డి గ్రామస్థులతో కలిసి మార్చి 19న వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించారు. శుక్రవారం ఇరిగేషన్ డీఈ రవికుమార్, ఏఈ వరప్రసాద్, ఆర్ఐ రజితరాణిలు గ్రామానికి చేరుకొని సర్వే నెం.402, 403లో ఆక్రమణకు గురైన నాలాను జేసీబీ సాయంతో తొలగించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్/బొంరాస్‌పేట్/కొడంగల్, ఏప్రిల్ 12: దౌల్తాబాద్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ట్రీ ట్రిమ్మింగ్, సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ కొడంగల్ ఏడీఈ నవీన్‌కుమార్, దౌల్తాబాద్ ఏఈ మహిపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా బొంరాస్‌పేట్ మండలంలోని కొత్తూర్ 33 కేవీ ఫీడర్‌లో మరమ్మతు కారణంగా మండలంలోని పలుగ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, దుద్యాల మండలంలో ఎస్ఎస్ మెయింటేనెన్స్ పనుల కారణంగా ఉదయం 9నుంచి 10గంటల వరకు, కొడంగల్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ బుల్కాపూర్ ఫీడర్ పరిధిలోని బుల్కాపూర్, చిట్లపల్లి, ఐనన్‌పల్లి, ఖాజఅహ్మద్‌పల్లి, మైసమ్మ తండా, పోచమ్మతండా గ్రామాలకు ట్రీ ట్రిమ్మింగ్ పనుల కారణంగా ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఆయా మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- కాగ్నా నది నుంచి ఇసుక తరలింపు
- పట్టించుకోని మైన్స్, రెవెన్యూ అధికారులు
- పోలీసులు దాడులు చేసినా ఆగని రవాణా
- టాస్క్‌ఫోర్స్ పోలీసులు దృష్టిసారించాలి



గోనూరు కాగ్న నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తూ సీజ్ అయిన ట్రాక్టర్ (ఫైల్)

తాండూరు రూరల్, ఏప్రిల్ 12: నదులను కొల్లగొడుతూ అక్రమార్కులు ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. పోలీసులు దాడులు చేసినా ఇసుక రవాణా మాత్రం ఆగడం లేదు. మండలంలోని గోనూరు, ఖాంజాపూర్, వీర్‌శెట్టిపల్లి, చంద్రవంచ చిట్టిఘనాపూర్, ఎల్మకన్నె గ్రామ శివారులో పారుతున్న కాగ్నానదిలో నుంచి అక్రమార్కులు ఇసుక రవాణా చేస్తున్నారు. రాత్రీపగలు తేడా లేకుండా నదిలో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మైన్స్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక తరలింపు అనుమతులు ఇచ్చే రెవెన్యూ అధికారులైతే సిబ్బంది కొరత ఉందని తామేం చేయగలమని అంటున్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తూ వ్యాపారం చేసుకుని సొమ్ము చేసుకుంటుంటే రాయల్టీ ద్వారా ఆదాయం పెంపొందించుకోవాల్సిన మైన్స్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ అధికారులు కళ్లుతెరుచుకుని అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్ని కేసులైనా.. ఆగని ఇసుక అక్రమ రవాణా

ఇసుక అక్రమార్కులపై ఎన్ని కేసులు పెట్టినా ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. మండలంలోని గోనూరుకు చెందిన రెండు ట్రాక్టర్లు వీర్‌శెట్టిపల్లి శివారులోని కాగ్నా నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా, కరన్‌కోట్ పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. ఖాంజాపూర్ గ్రామంలో శనివారం ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మద్దూరు శ్రీనివాస్ ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశారు. కేసులు నమోదు చేసినా అక్రమార్కుల్లో మాత్రం మార్పు రావడం లేదు.

కాంగ్రెస్ కీసర మండల సేవాదళ్ అధ్యక్షుడిగా మహేందర్



మహేందర్ భూపతికి నియామకపత్రం అందజేస్తున్న షఫీఉద్దీన్

కీసర, ఏప్రిల్ 12: కాంగ్రెస్ పార్టీ కీసర మండల సేవా దళ్ అధ్యక్షుడిగా జనగం మహేందర్ భూపతిని నియమించారు. ఈ మేరకు శుక్రవారం గాంధీ భవన్‌లో మహేందర్ భూపతికి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవా దళ్ అధ్యక్షుడు షఫీఉద్దీన్ కీసర మండలం భోగారం గ్రామానికి చెందిన మహేందర్ భూపతికి నియామక పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో కీసర మండల కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడిగా నియమించినందుకు మహేందర్ భూపతి అధిష్ఠానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా పార్టీ పటిష్ఠతకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

బీజేపీ గెలుపుతో సుస్థిర పాలన

- బీజేపీ మేడ్చల్-మల్కాజిగిరి రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి
- గుండ్లపోచంపల్లిలో ఇంటింటా ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 12: మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం విజయం సాధించిన నాడే దేశంలో సుస్థిరపాలన సాధ్యమని బీజేపీ మేడ్చల్-మల్కాజిగిరి రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో బీజేపీ నాయకులు గడప గడప బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ.. మోదీ మూడవ సారి ప్రధాని కావాలంటే ప్రజలు బీజేపీకే ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్ అమరం సరస్వతి, నాయకులు మల్లికార్జున్ ముదిరాజ్, రవీందర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అమెజాన్ డెలివరీ బాయ్ గంజాయి దందా

- డెలివరీ బ్యాగులో వస్తువులతోపాటు గంజాయి సరఫరా
- అరెస్ట్ చేసిన మేడ్చల్ ఎస్‌వోటీ పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అమెజాన్ డెలివరీ బాయ్ ముసుగులో గంజాయి తరలిస్తున్న యువకుడితో పాటు అతడికి గంజాయి సరఫరా చేసిన మరో యువకుడిని మేడ్చల్ ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. లాల్‌బజార్‌కు చెందిన రోహిత్ అమెజాన్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. వచ్చిన ఆదాయం సరిపోకపోవడంతో గంజాయి విక్రయాలు చేసి సంపాదించాలని భావించాడు. దీనికోసం తనస్నేహితుడు ఒడిషాలో నౌపాడా ప్రాంతానికి చెందిన గిర్ధారిని సంప్రదించాడు. గిర్ధారి ఇచ్చిన గంజాయిని చిన్న ప్యాకెట్లుగా మార్చి ఎవరికీ అనుమానం రాకుండా అమెజాన్ పికప్ బ్యాగులో డెలివరీ ఐటమ్స్‌తోపాటు గంజాయి ప్యాకెట్లు పెట్టి కస్టమర్లకు సరఫరా చేస్తున్నాడు. ఎవరైనా చూస్తే అమెజాన్ నుంచి వచ్చిన ఆర్డర్ తీసుకుంటున్నట్లుగా ఉంటుంది కానీ అనుమానం రాదు. గంజాయి కావాలని రోహిత్ తన స్నేహితుడికి చెప్పాడు అడ్వాన్స్‌గా రూ. 10 వేలు కూడా ఇచ్చాడు. గిర్ధారి కొన్ని రోజులముందు తన స్వస్థలమైన ఒడిశాకు వెళ్లి 2 కేజీల గంజాయిని గుర్తుతెలియని వ్యక్తుల నుంచి కేజీకి రూ.2,500 చొప్పున కొనుగోలు చేసి నగరానికి తీసుకొచ్చాడు. ఇదే గంజాయిని రోహిత్‌కు ఇచ్చి మిగతా రూ.30 వేలు తీసుకుంటున్న సమయంలో మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రేకులబావి చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు యువకులను పట్టుకుని ఎస్‌వోటీ పోలీసులు విచారించారు. వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయి, ప్లాస్టిక్ కవర్లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భవనంపై నుంచి పడి పెయింటర్ మృతి

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 12: భవనంపై నుంచి పడి పెయింటర్ మృతిచెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. శామీర్‌పేట్ గ్రామానికి చెందిన మంగళారపు బిక్షపతి(46) పేయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శామీర్‌పేట్‌లో గత ఒక సంస్థ భవనం రెండో అంతస్తులో గురువారం పెయింటింగ్ పనిచేస్తున్నాడు. ప్రమాదవశాత్తు రోప్‌తాడు తెగిపోవడంతో భవనంపై నుంచి కిందపడిపోయాడు. దీంతో అతడికి తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

కొడంగల్, ఏప్రిల్ 12: రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి మృతి చెందిన ఘటన కొడంగల్‌లో చోటుచేసుకుంది. కొడంగల్ ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రావుల్‌పల్లి గ్రామానికి చెందిన తలారి నర్సప్ప(50) శుక్రవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి ముందు నడుచుకుంటూ హైదరాబాద్-బీజాపూర్ హైవే దాటుతున్నాడు. ఈ క్రమంలో ఓటాటాఏస్ వాహనం హైదరాబాద్ నుంచి సేడం వైపు వేగంగా వెళ్తూ రోడ్డు దాటుతున్న తలారి నర్సప్పను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన నర్సప్పను ఆటోలో చికిత్స నిమిత్తం కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు తలారి అశోక్ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన జల్‌పల్లి కాటేదాన్ హైదరాబాద్‌కు చెందిన డ్రైవర్ అకాశ్‌గిరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మరొకరు..



నర్సింహులు మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 12: మండలంలోని కొత్తూర్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. గ్రామానికి చెందిన పెద్ద కుర్వ నర్సింహులు (48) గురువారం రాత్రి ఇంట్లో భోజనం చేసి రోజూ మాదిరిగా నిద్రించాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కుటుంబసభ్యులు గమనించగా మృతి చెంది ఉన్నాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబసభ్యులు కుర్వ అంజిలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గ్రామానికి వెళ్లి మృతికి గల కారణాలపై విచారణ చేపట్టారు.

యూట్యూబర్‌పై కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 12: అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఓ యూట్యూటర్‌పై న్యాయస్థానం ఆదేశాల మేరకు ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదుచేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంకుషాపూర్‌కు చెందిన కన్నెబోయిన రమేష్ ఘట్‌కేసర్ మున్సిపల్, ఎన్ఎఫ్‌సీనగర్‌లో 190గజాల విస్తీర్ణంలో మున్సిపల్ అనుమతితో ఇంటిని నిర్మించుకుంటున్నాడు. కీసర మండలం, రాంపల్లికి చెందిన దినేష్‌కుమార్ మార్చి 31న రమేష్ నిర్మిస్తున్న ఇంటి వద్దకు వెళ్లి తాను యూట్యూబ్ రిపోర్టర్‌ను అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. ఇంటికి అనుమతిలేనందున తనకు రూ.20వేలు ఇవ్వాలని, లేదంటే అధికారులు చెప్పి ఇంటిని కూల్చివేయిస్తానని హెచ్చరించాడు. దీంతో బాధితుడు ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ధారూరు, ఏప్రిల్ 12: తాళంవేసి ఉన్న ఇంటి తాళం పగుల గొట్టి బంగారం, వెండి, నగదును చోరీ చేశారు. ఈ ఘటన దోర్నాలలో చోటు చేసుకుంది ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. దోర్నాల గ్రామానికి చెందిన వెంకటయ్య ఈనెల 9న భార్య ఆరోగ్యం బాగాలేదని పుట్టింటికి పంపించాడు. ఈనెల 11వ తేదీన తాను పనులు ముగించుకుని తన అత్తగారి గ్రామమైన పరిగి మండలం, నస్కల్‌లో ఉన్న భార్య వద్దకు వెళ్లాడు. కాగా శుక్రవారం ఉదయం వెంకటయ్య అన్న యాదయ్య ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని వెంకటయ్యకు సమాచారం ఇచ్చాడు. వెంకటయ్య నస్కల్ నుంచి దోర్నాలకు వచ్చి చూడగా ఇంటితాళం విరగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా, ట్రంకు పెట్టెను పగులగొట్టి అందులో ఉన్న రెండు తులాల బంగారు నాను, మూడు మాసాల వంకీ, స్టీల్ డబ్బాలో ఉన్న 18తులాల వెండి పట్ట గొలుసులు, అరతులం, మూడు మాసాల బంగారు కమ్మలు, రూ.10వేలు నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటనపై శుక్రవారం బాధితుడు వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

తాండూరు రూరల్, ఏప్రిల్ 12: మల్కాపూర్‌లో బాల్య వివాహాన్ని అడ్డుకున్నట్లు కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన వెంకటేష్ కొత్లాపూర్ గ్రామానికి చెందిన ఓ బాలికతో శుక్రవారం వివాహం చేసుకునేందుకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అడ్డుకొని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అమ్మాయికి 18ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని సూచించారు. ఇరువురి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. బాలికను చైల్డ్‌లైన్ వారికి అప్పగించినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. బాల్యవివాహాలు చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎవరైనా బాల్యవివాహాలు చేస్తే జైలుకు పంపిస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

వివాహిత అదృశ్యం



జంగమ్మ

కడ్తాల్, ఏప్రిల్ 12 : కడ్తాల్ మండలంలోని అన్మాస్‌పల్లిలో ఓ వివాహిత అదృశ్యమైన ఘటన శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. అన్మాస్‌పల్లికి చెందిన మాదాపురం జంగమ్మ(36) ఈనెల 10న ఇంటి పక్క వారితో గొడవ పడింది. మరుసటి రోజు ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దాంతో ఆమె కుమారుడు నాగరాజు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు.